నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 30 మే 2024 | YADADRI BHUVANAGIRI

# కాయ్ రాజా కాయ్

## ఉమ్మడి జిల్లాలో జోరుగా బెట్టింగ్‌లు

- పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై పందేలు
- ఎక్కడ, ఎవరు గెలుస్తారోనని బెట్టింగ్‌లు
- భువనగిరి ఎంపీ స్థానంపై తీవ్రస్థాయిలో చర్చ
- ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపుపైనా..
- రూ.వెయ్యి నుంచి లక్షల వరకు బెట్టింగ్
- పెద్దఎత్తున చేతులు మారుతున్న డబ్బులు



యాదాద్రి భువనగిరి, మే 29 (నమస్తే తెలంగాణ) : 'పలానా పార్టీ గెలిస్తే లక్షకు రెండు లక్షలు.. ఆ సెగ్మెంట్‌లో బీజేపీ విజయం సాధిస్తే ఎంత కట్టడానికైనా రెడీ. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు డబుల్ డిజిట్ దాటితే మూడింతలు రెట్టింపు' ఇవీ ప్రస్తుతం నడుస్తున్న బెట్టింగ్‌లు. ఎన్నికల నేపథ్యంలో జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. పార్లమెంట్‌తోపాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై పందేలు కాస్తున్నారు. రూ. వెయ్యి నుంచి మొదలుకొని లక్షల వరకు బెట్టింగ్ కడుతున్నారు. అధికార, ప్రతిపక్ష అభ్యర్థుల గెలుపోటములపై పందేలు నడుస్తున్నాయి. దాంతో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి.

### బెట్టింగ్ ఇలా..

ఇటీవల ఐపీఎల్ క్రికెట్ ముగిసింది. ఇక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతోపాటు ఏపీలోని సరిహద్దు జిల్లాల జూదరులు సైతం బెట్టింగ్‌లు పెడుతున్నారు. భువనగిరి స్థానంపై అంతటా ఉత్కంఠ ఉండటంతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వాళ్లు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బెట్టింగ్‌లు వివిధ రూపాల్లో జరుగుతుంటాయి. కొందరు బుకీలు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్‌లు కడుతున్నారు. నేరుగా ఫోన్ల ద్వారానే కాకుండా వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి వాటిలో రహస్యంగా గ్రూపులు ఏర్పాటు చేసుకుని పందేలు కడుతున్నారు. మరికొందరు ఫామ్‌హౌస్‌లు, హోటళ్లలో నడిపిస్తుంటారు. ఇంకొందరు తమ సర్కిళ్లలో ఫోన్ల ద్వారా కూడా బెట్టింగ్ కొనసాగిస్తుంటారు. టెక్నాలజీ పెరిగిపోవడంతో ఫోన్ పే, గూగుల్ పే తదితర యూపీఐ ట్రాన్జాక్షన్లు చేస్తున్నారు.

### లెక్కలన్నీ తీశాకే..

పందెంరాయుళ్లు వివిధ అంశాలను బేరీజు వేసుకుని బెట్టింగ్‌లు కాస్తుంటారు. ముఖ్యంగా బరిలో ఉన్న అభ్యర్థి ఏ సామాజిక వర్గానికి చెందినవాడు..? బరిలో నిలిచిన వ్యక్తి కులానికి చెందిన ఓట్లెన్ని ఉన్నాయి..? ప్లస్‌లు, మైనస్‌లు ఏంటి..? ఆయా పార్టీల బలాబలాలు ఏంటి..? అధికార పార్టీ బలంగా ఉందా..? ప్రతిపక్షం బలంగా ఉందా..? గతంలో అక్కడి విజయం సాధించిన అభ్యర్థి ఎవరు..? అప్పట్లో ఎన్ని ఓట్లతో గెలిచారు..? సర్వేలు ఏం చెబుతాన్నాయి..? క్షేత్రస్థాయిలో జనం ఏమనుకుంటున్నారు..? అనే తదితర విషయాలపై ఆరా తీసిన తర్వాతే పందేలకు దిగుతారు. ఆయా స్థానాల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు సాధిస్తుంది..? రెండో స్థానంలో ఎవరుంటారు..? తదితర అంశాలపై బెట్టింగ్‌లు కాస్తున్నారు.

### రూ. వెయ్యి నుంచి లక్షల్లో..

పందేంరాయుళ్లు రూ. వెయ్యి నుంచి మొదలుకొని రూ. లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఆ పార్టీపైనే ఎక్కువ మంది బెట్టింగ్‌కు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలకు 11 చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలువడంతో ఆ పార్టీపైనే అధిక శాతం ఆశలు పెట్టుకున్నారు. ఆ తర్వాత ఎక్కువ బలం ఉన్న చోట బీఆర్ఎస్, బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. నల్లగొండలో బీజేపీ ప్రభావం లేనప్పటికీ, భువనగిరిలో మాత్రం పోటీ ఇవ్వడంతో కమలం పార్టీపై బెట్టింగ్ కాస్తున్నారు.

### వీటిపైనే ఎక్కువగా..

- ఉమ్మడి నల్లగొండలో రెండు సీట్లను కాంగ్రెస్ గెలుస్తుందని కొందరు.. గెలువదని మరికొందరు బెట్ కడుతున్నారు. ఒక్కటే సీటు గెలుస్తుందని ఇంకొందరు పందెం కాస్తున్నారు. రెండు సీట్లు గెలిస్తే మూడింతలు ఇచ్చేట్లుగా పందెం నడుస్తున్నది.
- గతంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎంపీగా ఉన్న భువనగిరిలో మళ్లీ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, లేదు.. ఓడిపోతుందని జోరుగా బెట్టింగ్ పెడుతున్నారు.
- భువనగిరి ఎవరు గెలుస్తారనే తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తున్నది. సర్వేలు సైతం టఫ్ ఫైట్ ఉన్నట్లు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై పెద్ద స్థాయిలో బెట్టింగ్ కాస్తున్నారు. ఏపీ సరిహద్దు జిల్లాల పందెంరాయుళ్లు సైతం దీనిపై ఫోకస్ పెట్టారు. ఇక్కడ బీఆర్ఎస్ గెలిస్తే అధిక రెట్లు ముట్టజెప్పే బెట్టింగ్‌లు నడుస్తున్నాయి.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ గెలుస్తుందనే చర్చ రావడంతో రాకేశ్ రెడ్డి గెలుపుపై భారీగా పందేలు కాస్తున్నారు. ఇంకొందరు అధికార పార్టీ మద్దతు ఉన్న తీన్మార్ మల్లన్న గెలుస్తుందని ఆశాభావంతో పందెం కడుతున్నారు.

### వాళ్లే టార్గెట్..

ఎన్నికలే అదనుగా భావించిన బెట్టింగ్ ముఠాలు అమాయకులను ఉసిగొల్పుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆశచూపి బెట్టింగ్‌లోకి దింపుతున్నాయి. ఈజీ మనీకి అలవాటు పడిన యువకులు బెట్టింగ్ వైపు ఎక్కువగా మొగ్గు చూపి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఎక్కువ డబ్బు వస్తుందనే ఆశతో కొంత మంది అప్పులు చేసి మరీ పందేలు కాస్తున్నారు. ఈ బెట్టింగ్‌లతో సర్వం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో పోలీసులు కూడా స్పెషల్ ఫోకస్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు బడా పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం బుకీలుగా అవతారం ఎత్తి బెట్టింగ్‌లు కాస్తున్నట్లు తెలుస్తున్నది.

# పోలీసుల అదుపులో ముగ్గురు తాసీల్దార్లు?

- ప్రభుత్వ భూమి అక్రమాలపై వివాదం
- కోర్టు ఆదేశాల మేరకు అధికారుల విచారణ
- నేడు కోర్టుకు రిమాండ్ చేసే అవకాశం

నిడమనూరు, మే 29 : నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని పలువురికి అక్రమంగా కట్టబెట్టారన్న వివాదం నేపథ్యంలో ముగ్గురు తాసీల్దార్లను జిల్లా కేంద్రానికి చెందిన సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. మండలంలోని తుమ్మడం, వల్లభాపురం శివారుల్లోని 540, 840, 1072 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమికి అధికారులు అడ్డదారిలో పట్టాలు మంజూరు చేసినట్లు గతంలో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు గతంలో ఇక్కడ పనిచేసిన ముగ్గురు తాసీల్దార్లు, ఓ మాజీ వీఆర్వో, అక్రమ పట్టాదారులను బుధవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు, పట్టాదారులను అదుపులోకి తీసుకున్న విషయాన్ని పోలీసులు ధృవీకరించకపోవడం గమనార్హం. సామాజిక మాధ్యమాల్లో ఈ విషయం చక్కర్లు కొట్టడం సంచలనంగా మారింది. కాగా, మాజీ వీఆర్వోను రెండ్రోజుల క్రితమే అదుపులోకి తీసుకుని అక్రమాలపై కూపీ లాగాక పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని గురువారం కోర్టుకు రిమాండ్ చేయనున్నట్లు తెలిసింది.

# తెలంగాణ చిహ్నభిన్నంపై ఆగ్రహం

## కాకతీయ కళా తోరణం, చార్మినార్ తొలగింపుపై తీవ్ర విమర్శలు

- రాష్ట్ర అధికార చిహ్నంపై సంకుచిత ధోరణి తగదని హితవు
- రాచరికానికి, సాంస్కృతిక వైభవానికి తేడా తెల్వదా అని ప్రశ్నలు
- చిహ్నాల్లో మార్పులు కాదు.. ప్రజల్లో జీవితాల్లో తేవాలంటూ సూచన
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

**అలనాటి తెలంగాణ వైభవానికి, చారిత్రక వారసత్వానికి ప్రతీకలైన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి తొలిగించే కాంగ్రెస్ సర్కారు కుట్రలపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. వెయ్యేండ్ల సాంస్కృతిక వైభవానికి, తెలంగాణ అస్థిత్వానికి చిహ్నాలుగా కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌ను ప్రజలు గొప్పగా భావిస్తుంటారు. అలాంటి వాటిపై రాచరికపు ఆనవాళ్లన్న ముద్రవేసి వాటిని తెరమరుగు చేయాలనుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానమే తప్ప, గొప్పదనం కాదని ప్రజలు మండిపడుతున్నారు.** – నల్లగొండ ప్రతినిధి, మే29(నమస్తే తెలంగాణ)

**ఉమ్మడి జిల్లాలో చారిత్రక కట్టడాలు, గొలుసు కట్టు చెరువులు**

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కాకతీయ కాలం నాటి చారిత్రక కట్టడాలు, గొలుసుకట్టు చెరువులు, ప్రాచీన శివాలయాలు ఇలా ఎన్నో నేటికీ జిల్లా ప్రజలతో విడదీయలేని చారిత్రక బంధాలుగా కొనసాగుతున్నాయి. ప్రజల రోజువారీ జీవన విధానాల్లో ఇప్పటికీ కాకతీయుల కృషి ఫలితాల ప్రభావం ఎంతో ఉంటుంది. చరిత్రకారులు చెప్తున్న దాని ప్రకారం కాకతీయుల రాజధానిగా విలసిల్లిన ఓరుగల్లుకు ఆనుకుని ఉండడంతో నల్లగొండపైనా కాకతీయుల ముద్ర చెరిపినా చెరిగిపోదు. కాకతీయుల కళాతోరణానికి శాలిగౌరారం మండలంలోని వల్లాలలో వెలసిన శిలాతోరణమే మాతృక అని చరిత్రకారులు ధ్రువీకరించారు. దీనికి తోడు కాకతీయ మహారాణి రాణి రుద్రమదేవి నకిరేకల్ మండలం చందుపట్లలో శివైక్యం చెందినట్లుగా ఓ శాసనం నేటికీ ఉంది. రాణిరుద్రమదేవితోపాటు ఆమె సేనాని మల్లిఖార్జున నాయకుడి మరణాలకు గుర్తుగా రుద్రమ సేవకుడు పువ్వుల ముమ్మడి చందుపట్ల శాసనం వేయించినట్లు చరిత్ర చెబుతున్నది. 1289 నవంబర్ 27న రుద్రమ మరణించినట్లు శాసన లిఖితాక్షరాలు చెప్తున్నాయి. ఇక చందుపట్ల గ్రామం శివార్లలో నేడు పెద్ద చెరువుగా పిలుస్తున్న అలనాటి రా–సముద్రం పేరు సైతం పొదిగి ఉంది. శివారాధకులైన ఓరుగల్లు పాలకులు నాడు ఈ మార్గం గుండా పిల్లలమర్రి, ఇనుపాముల, చందుపట్ల, పానగల్లు పట్టణాల మీదుగా శ్రీశైలానికి వెళ్లే వాళ్లని చరిత్రకారులు చెప్తున్నారు. ఇక పానగల్లులోని ఉదయసముద్రం చెరువు, దాని దిగువన ఛాయ, పచ్చల సోమేశ్వరాలయాలు కూడా కాకతీయ కాలంలోని పాలన వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. కాకతీయులు నిర్మించిన పానగల్లు, పిల్లలమర్రి శివాలయాలు శతాబ్దాలుగా ప్రజల చెరగని విశ్వాసాలకు కేంద్రాలుగా మారాయి. రాచకొండ, దేవరకొండ లాంటి ప్రాంతాలు సైతం కాకతీయుల పాలనలో ప్రసిద్ధి చెందినవిగా భావిస్తారు. జిల్లాకు చెందిన ఇలాంటివి ఎన్నో శతాబ్దాలుగా ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయి, ప్రగతికాముక చిహ్నాలుగా నిలుస్తున్నాయి. కాకతీయుల కాలం నాటి కట్టడాలు, నిర్మితాలతో ఉమ్మడి నల్లగొండకు కూడా చారిత్రక వైభవం నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కాకతీయ కళాతోరణాలను రాచరికపు ఆనవాళ్లంటూ కాంగ్రెస్, ఆ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తుండడాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ముఖ్యంగా చరిత్రకారులు, సాహిత్యకారులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. అధికార చిహ్నంలో మార్పులు చేయగలరేమో కానీ, అనాదిగా ప్రజల మనస్సులతో పెనవేసుకుపోయిన కాకతీయ వైభవాన్ని చెరిపివేయలేరని స్పష్టం చేస్తున్నారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాచరికపు ఆనవాళ్లు అని చెప్పడమంటే రేవంత్‌రెడ్డికి చరిత్ర పట్ల, చారిత్రక అంశాల పట్ల ఏ మాత్రం అవగాహన ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాపాలన పట్ల చిత్తశుద్ధి ఉంటే జనం జీవితాల్లో వెలుగులు నింపే మార్పులు చేపట్టాలని హితవు పలుకుతున్నారు. చరిత్ర ఆనవాళ్లను చెరిపివేస్తే కాంగ్రెస్ పార్టీని, ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న రేవంత్‌రెడ్డిని భవిష్యత్ తరాలు క్షమించబోవని హెచ్చరిస్తున్నారు.

### రేవంత్‌రెడ్డి అహంకారానికి నిదర్శనం

తెలంగాణ రాజముద్ర నుంచి కాకతీయ కళా తోరణం, చార్మినార్ చిహ్నాలను తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది? కాకతీయ తోరణం, చార్మినార్ అనేవి ఏ ఒక్కరి సొత్తు కాదు.. తెలంగాణ ప్రజల ఆత్మతో కూడిన చిహ్నాలు. ఇప్పుడు వీటిని తొలగించడం రేవంత్‌రెడ్డి అహంకారానికి నిదర్శనం. తెలంగాణలోని కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు దీన్ని ఒప్పుకోరు. రేవంత్‌రెడ్డి తక్షణమే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి గతంలో ఉన్న వాటిని అలాగే ఉంచాలి. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో నల్లగొండ జిల్లా దేవరకొండలోని ఖిలాపై ఉన్న పూర్ణకుంభం రాష్ట్ర ముద్రలో ఉంది. వాటిపై ఆంధ్రా, రాయలసీమ, తెలంగాణలో ఎవ్వరూ అభ్యంతరం చెప్పలే. అందరూ హర్షించారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఏ అవసరం కోసం వీటిని తొలగిస్తున్నారు? అలాగే అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గేయాన్ని ఆంధ్రాకు చెందిన సంగీత దర్శకునితో ఆంధ్రాకు అనుకూలంగా ఉండేలా తయారు చేస్తున్నట్లు తెలుస్తుంది. వీటిని వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ సంస్కృతి, కళలను నాశనం చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తుండు. తెలంగాణ అస్థిత్వాన్ని చెడగొడితే ప్రజలు చూస్తూ ఊరుకోరు.

**- బక్క పిచ్చయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు, కోమలి కళా సమితి, నల్లగొండ.**



### తెలంగాణ ఆత్మ గౌరవానికి తీరని నష్టం



తెలంగాణ రాష్ట్ర గీతంలో రాచరికపు ఆనవాళ్ల పేరుతో తెలంగాణ శౌర్య ప్రతాపాలకు ప్రతీకగా ఉన్న కాకతీయ కళాతోరణం, చార్మినార్ వంటి చారిత్రాత్మక కట్టడాలను తొలగించడం తెలంగాణ ఆత్మ గౌరవానికి తీరని నష్టం. కవులు, రచయితలు, కళాకారులకు సాహితీవనం, కవనానికి పెట్టింది పేరు కాకతీయ కళాతోరణం, చార్మినర్ వంటి చారిత్రాత్మక కట్టడాలను రాష్ట్ర గీతం నుంచి తొలగించకుండా అవసరమైతే కొత్త వాటిని పొందుపర్చాలి తప్ప తీసివేయడం సరి కాదు. ముఖ్యమంత్రి మరోమారు ఆలోచించుకోవాలని కవులు, రచయితలు, సాహితీ అభిమానుల పక్షాన కోరుతున్నాను. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి తెలంగాణ అస్థిత్వాన్ని మరుగున పడకుండా ప్రగతి పథంలో అభివృద్ధి చేయాలి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సైతం పరిగణలోకి తీసుకొని కాకతీయ కళాతోరణం వేయి స్తంభాల గుడి వంటి వాటిని గేయంలో పొందుపర్చాలి.

**- పోతుగంటి వీరాచారి, కవి రచయిత, సూర్యాపేట**

### ఉద్యమ పాటకు సంగీతం ఇవ్వనోళ్లని.. ఇప్పుడు నెత్తిన పెట్టుకొని ఊరేగడమే..



జయ జయహే తెలంగాణ గేయానికి ట్యూన్ మార్చి రికార్డు చేసేందుకు కీరవాణిని ఎన్నుకోవడం విడ్డూరంగా ఉంది. ఈ పాటకు ప్రోగ్రామింగ్ చేసే నైపుణ్యం ఉన్న వాళ్లు తెలంగాణలో లేరనుకున్నారా? ఏమో అర్థం కావట్లేదు. ఇప్పుడు ట్యూన్ మార్చితే ఆ పాట జీవం దెబ్బతింటుంది. పాట బయటికి వస్తే గానీ పరిస్థితి అర్థం కాదు. ఏది ఏమైనా సాహిత్యం, సంగీతం రెండింటికీ సంబంధించిన క్రెడిట్ అందెశ్రీకే దక్కాలి. ఎందుకంటే పాటకు ఎవరు బాణి(ట్యూన్) సమకూరుస్తారో వారే సంగీతం వహిస్తున్నట్లు లెక్క. మిగతా వాయిద్య సహకారం అంతా మనం కోరుకున్న విధంగా మన ఇష్టం వచ్చిన వారితో పని తీసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆంధ్రా సంగీత దర్శకుడి సారథ్యంలో వినాల్సి రావడం తెలంగాణ ప్రజల దురదృష్టం. అప్పుడు తెలంగాణ ఉద్యమంలో మన పాటలకు సంగీతం అందించమంటే కాదన్న వాళ్లను ఇప్పుడు నెత్తిన పెట్టుకొని ఊరేగడమే. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

**-అభినయ శ్రీనివాస్, సినీ గీత రచయిత, మోత్కూరు**

# నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ క్లినిక్‌లు

- ప్రథమ చికిత్స కేంద్రాల పేరుతో ఆస్పత్రుల నిర్వహణ
- అబార్షన్లు, శస్త్ర చికిత్సలు
- నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పలు ఆస్పత్రుల్లో మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీలు
- 55 మందిపై కేసులు నమోదు



సూర్యాపేటలో మెడికల్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు శేషుమాధవ్ తదితరులు

నీలగిరి/బొడ్రాయిబజార్, మే 30 : నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ప్రథమ చికిత్స కేంద్రాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు ఆస్పత్రులపై బుధవారం రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ప్రథమ చికిత్స కేంద్రం అని పెట్టి రోగులను అడ్మిట్ చేసుకోవడం, సెలైన్‌లు ఎక్కించడం, అబార్షన్లు, ఆపరేషన్లు తదితర శస్త్ర చికిత్సలు చేస్తున్న 51 ఆస్పత్రుల్లో తొమ్మిది బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేసి 55 మందిపై కేసులు నమోదు చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో 25, సూర్యాపేటలో 10, చండూర్‌లో 5, మునుగోడులో 6, తిప్పర్తిలో 5 చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో వాడుతున్న మందులను గుర్తించారు. యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్, ఇంజక్షన్స్, గర్భవిచ్ఛిత్తి మాత్రలు, పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు, కాలం చెల్లిన, అమ్మకానికి వీలు లేని మందులను రోగులకు అందిస్తున్నట్లు గుర్తించారు. అక్కడున్న రోగులతో మాట్లాడి ఏ సమస్యతో వచ్చారు, ఎప్పటి నుంచి ఆస్పత్రిలో చేరారనే వివరాలను వీడియో రూపంలో తీసుకుని పోలీసులకు అప్పగించారు.

### ప్రజారోగ్య వ్యవస్థను మెరుగుపర్చేందుకే..

**రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శేషుమాధవ్**

ఈ సందర్భంగా సూర్యాపేట, నల్లగొండలో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాసవ్య, నిత్య, కేఎన్ఎం, సింధుతోపాటు పలు మెడికల్ క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. సరైన విద్యార్హతలతోపాటు జిల్లా వైద్యాధికారి అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు పదో తరగతి చదివి వైద్యం చేస్తున్నారని, గ్లూకోజ్ ఎక్కించడం, రక్త పరీక్షలకు శాంపిళ్లు సేకరించడం, ఇష్టానుసారంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై ఎన్ఎంసీ యాక్ట్ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయడంతోపాటు సంవత్సరం జైలు శిక్ష, రెండోసారి దొరికితే రెండేండ్ల జైలుశిక్ష రూ.25 లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ఆయా సమావేశాల్లో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్, లీగల్ యాంటీ క్వాకరీ బృందం సభ్యుడు శేషుమాధవ్, ఎఫ్ఎంజీ చైర్మన్ శ్రీకాంత్‌వర్మ, సభ్యులు రవికుమార్, శశిధర్, నరేశ్ కుమార్, రాజీవ్‌నాయక్, సంతోష్‌రెడ్డి విష్ణు, ఇమ్రాన్ అలీ పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 29 : పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ పట్ల పూర్తి అవగాహన పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌంటింగ్ ఏఆర్ఓలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 4న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ప్రత్యేక హాలులో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం 14 టేబుల్స్ ద్వారా లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ప్రతి టేబుల్‌కు తాసీల్దార్ స్థాయి ఏఆర్ఓ, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పారదర్శకతతో నిర్వహించాలని, ఏమైనా అనుమానాలుంటే మరొకసారి అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటల వరకు కేటాయించిన టేబుళ్ల వద్దకు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ రెడ్డి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా శిక్షణ నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

### కౌంటింగ్ పక్రియను నిశితంగా పరిశీలించాలి

కౌంటింగ్ ప్రక్రియను నిశితంగా గమనించాలని జిల్లా ఎన్నికల అధికారి హనుమంత్ కె.జెండగే మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియపై మైక్రో అబ్జర్వర్లకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంట్రోల్ యూనిట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పరిశీలనకు మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వారు ఫలితాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకొని జనరల్ అబ్జర్వర్‌కు నివేదిక సమర్పించాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

# రెండు రైస్ మిల్లులకు తాళం



తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని సంతోషి రైస్ మిల్లుకు తాళం వేసిన అధికారులు

తిరుమలగిరి మే 29 : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పక్కదారి పట్టించారన్న ఆరోపణలపై తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోయేషన్ మాజీ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, ఆయన సోదరుడు సోమయ్యను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని వారి నివాసంతోపాటు తొండ గ్రామంలోని సంతోషి రైస్ మిల్, నాగారం మండల పరిధిలోని రఘురామ రైస్ మిల్‌ను అధికారులు సీజ్ చేసి తాళాలు వేశారు. రూ.100 కోట్లకు పైగా ప్రభుత్వ ఖజానాకు వీరు గండి కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2020–21 సంవత్సరానికి సంబంధించి తొండ గ్రామంలోని సంతోషి రైస్ మిల్ నుంచి రూ. 91.31 కోట్లు, నాగారం మండల పరిధిలోని ప్రగతి నగర్ రఘురామ రైస్ మిల్ నుంచి రూ. 7.71 కోట్ల విలువైన ధాన్యం బకాయి ఉన్నట్లు అధికారులు గతంలో లెక్కలు చెప్పారు.

# నల్లగొండలో విత్తన దుకాణంపై విజిలెన్స్ దాడి



నల్లగొండ ప్రకాశం బజార్‌లోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ బృందం

నల్లగొండ, మే 29 : పలు దుకాణాల్లో బ్లాక్‌లో విత్తనాలు విక్రయించడంతోపాటు విక్రయించిన వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో వ్యవసాయ శాఖ విజిలెన్స్ బృందం బుధవారం నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో ఇడుకుళ్ల నర్సయ్య దుకాణంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించింది. స్టాక్‌కు, రికార్డుల్లో నమోదుకు తేడాలు ఉండడంతో అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించింది. ఒక్కో పత్తి విత్తన ప్యాకెట్‌ను ఎమ్మార్పీ కంటే రూ.400–500 వరకు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ దాడులు చేశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ దాడుల్లో సీఐ గౌస్, ఏఓ శ్రీనివాస్, రాంబాబు, భవాని, శంకర్, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.